# ఆత్మహత్య

ఆత్మహత్య అతిసులువు. ఏముంది? ఒక్క క్షణం మమకారాలు మరచిపోగలిగితే, "ఇవేవీ నావికావు" అని అరక్షణం అనుకోగలిగితే చాలు, ఐదు ప్రాణాలూ క్షణంలో పోతాయి, మనిషి కన్నుమూసేస్తాడు. ఇక అతనిగుండె కొట్టుకోదు. అతన్ని అన్ని బాధలూ వదిలేస్తాయి.

ఆత్మహత్యకు ఏంకావాలి ? తాడుతో ఉరిపోసుకోవచ్చు, కిరసనాయిలుతో స్నానం చేసినిప్పు పెట్టుకోవచ్చు. ఎలక్ట్రిక్ వైర్లు ముట్టుకోవచ్చు. గ్లాసుడు ఎండ్రిన్ తాగవచ్చు. పెరట్లో భావిలోకి గెంతవచ్చు.

ఇంకా కావలసిందల్లా ఒక బలమైన నిశ్చయమే. "ఈ జన్మ. బరువై పోయింది" అనుకుంటే చాలు. "నేను మోయలేను ఈ జీవితభారం" అనుకుంటే చాలామంది విషయంలో

చాలు. కొద్దిమంది విషయంలో "ఏముందీ జన్మలో" అన్న విరక్తి వచ్చినా చాలు.

"ఆత్మహత్య యింత సుఖవా ?" విసుపోయేడు రంగనాథం. ఇన్నింటిలో ఏం చేసినా ప్రాణం పోతుంది. ఒక్కటే కాదు. పంచప్రాణాలూ పోతాయి. "రఘురామా ! ఇంట్లో అన్నీ ఉన్నాయి. దూలాలున్నాయి. తాళ్ళున్నాయి. బావి వుంది. కరెంటు వైర్లున్నాయి. ఎండ్రిన్ వుంది. ప్రాణాలు తీసేసుకుంటానన్న కామాక్షమ్మకూడావుంది. ఇప్పుడావిడ కేం తక్కువ ? ఆరోగ్యంగా వుంది, ఐశ్వర్యంవుంది, రత్నాల్లాంటి పిల్లలున్నారు.ఏనున్నాడు. బిజినెస్ వుంది. భూమివుంది. మంచి బుద్ధిలేదు. ప్రాణాలు తీసేసుకుందావన్న బుద్ధి మాత్రం వుంది.

ఈ వ్యధ భరించలేను. ఆమె బెదిరింపుకు హద్దులు కూడా లేవు. భూమి అమ్ముతానంటే ఆత్మహత్య చేసుకుంటానంటుంది. బెనారస్ చీర వచ్చే సంక్రాంతికి కొనుక్కోవచ్చంటే ప్రాణాలు తీసేసుకుంటానంటుంది. కారు కొందాం అన్నా అదే బెదిరింపు. కటకం వెళ్ళొద్దన్నా అదే బెదిరింపు. బెదిరించేవాడికి బెదిరించడం తేలికే. అతి తేలిక. "ఏముంది, మీరిలా చేసినా లేక మీరిలా చెయ్యకపోయినా నన్నుమళ్ళీ ప్రాణాలతో చూడరు" అనేస్తేసరి. అలా ఆవిడ అన్నాక తను పడేవ్యధ శత్రువుకికూడా వద్దు. ఆవిడ ఒకే బెదిరింపు అతని మొహంమీద పడేసి, అటు తిరిగి పడుకుంటుంది. ఆ తర్వాత అతడు పడేబాధ ఆ పరమాత్ముడికే తెలుసు. తను నిద్రపోతే ఏ అర్ధరాత్రి ఏ అఘాయిత్యంచేసేస్తుందో అన్నభయంఅతనికి

ఎన్ని రాత్రుళ్ళు కంటికి కునుకు లేకుండా, మనసుకి శాంతి లేకుండా చేసింది? ఆమె నిజంగా పడుకుందా? లేకపోతే ఆమె నిద్ర నటనా? ఒక్కొక్కరాత్రి ఎన్నోసార్లు లేచిచూసే వాడు. అదృష్టవంతురాలు, కనురెప్పైనా అల్లల్లాడకుండా హాయిగా పసిపిల్ల నిద్రపోతున్నట్లుగా నిశ్చలంగా కనిపించేది ఆమె మొహం.

"భగవాన్! ఈ రాత్రి యిలా గడవనిచ్చినందుకు నీకు ఎలా కృతజ్ఞత తెలియచేసుకోవడమో తెలియడంలేదు" అని అనుకుంటూ లైటు ఆర్పి తన పక్కమీద కూర్చునేసరికి, ఒక్కొక్కసారి మంచం స్ప్రింగుల చప్పుడుకు మేలుకున్నట్లు "ఇంకా నిద్దర్లేదటండీ? పడుకోండి పిచ్చివేషాలుమాని" అని అటుతిరిగి పడుకునేది.

తనది కేవలం పిచ్చివేషం కాదు. అసలు పిచ్చే. లేకపోతే మేలుకున్న మనిషినిచూసి వళ్ళుమరచి నిద్రపోతున్నదని యెలా అనుకోగలిగేడు? ఇలా కొన్ని రాత్రులు నిద్ర లేకుండా నరాలని కొరికే ఆతృతతో మేలుకునుంటే అతనికి నిజంగా పిచ్చే ఎక్కిపోతుంది. ఎక్కిపోతే బావుణ్ను. శని విరిగి పోయేది. అప్పుడు తను ఏం చేసినా ఎవరూ బాధ్యత తనకి చుట్టరు. తనింట్లో యెవరు ఏం చేసినా తనని చూసి ఎవరూ అసహ్యించుకోరు. అవమానించరు. పిచ్చివాడిగానైనా తను తలెత్తుకు తిరగ్గలుతాడు.

కాని ఆమె నిండుప్రాణం తీసుకుంటే? రామప్రభో! ఈ అవమానం భరించటం ఎలా! గోడ్డుమీద యెదురయ్యే

ప్రతీ బేడాపరకగాడూ తనని చులకనగా అవమానంగానే చూస్తాడు. ప్రతి ఆడదీ తనని చూసి తలుపేసుకుంటుంది. తనకి తెలిసిన ప్రతివాడూ "రంగనాథంగారూ అన్నట్టు ఈమధ్య..." అని తర్వాత ప్రాణాలు పోయినట్టు ఆగిపోతాడు. అనేసిన ఏ మాటైనా, ఏ అవమానమైనా సరే భరించవచ్చు. కాని ఉచ్చరించకుండా వదిలేసిన అవమానం ఎవరు భరించగలరు?

"అబ్బో! అలా కనిపిస్తాడుగాని..."

"ఊఁ కనిపిస్తాడు గాని..." తర్వాత ఎవరూ పూర్తి చెయ్యరు. ఆ చెయ్యనిమాటలు తను పూర్తి చేసుకోగలడు.

"పెళ్ళాన్ని ఆత్మహత్యకు తరిమినవాడు... నిజంగా ఆత్మహత్యేనా... ఆఁ హాఁ! ఆత్మహత్యేనా... ఆత్మహత్యే అయ్యుంటుందిలే..."

"ఎండ్రిన్ ఎంత తాగాలో ఆవిడకెలా తెలుసయ్యా?" "నిజమే సుమీ" ఈరోజుల్లో సూసైడ్ చేసుకునే వాళ్ళెవరన్నా ఒక ఉత్తరం అయినా రాయకుండా ఛస్తారటండీ? కామాక్షమ్మకు ఈమాట తెలుస్తోలేదో? ఇంతకీ పెళ్ళాన్ని ఆత్మహత్యకు తరిమిన వాడికీ, హత్యచేసిన వాడికీ ఏఁవిఁటి భేదం? తల వెంట్రుకవాసి.

తన స్నేహితులే తనని శంకిస్తారు. తన పనివాళ్ళే తనని చూసి అతి వినయం చూపి "హంతకుడు" అని అనకుండా అంటారు. తనని ఆఫీసుకి తీసుకువెళ్ళే కారుడ్రైవరు తనని రియర్ వ్యూ మిర్రర్లో ఒకకంట కనిపెడుతూనే వుంటాడు, ఎప్పుడు వెనకనుండి తను కొరికేస్తాడేమోనని భయపడుతున్నట్టు. బహుశా పోలీసులుకూడా రావచ్చు.

ఆలోచిస్తూ రంగనాథం కుర్చీలో కూలిపోయేడు. ఎదురుగుండా పుస్తకాల బీరువా గాజు తలుపులతో దుర్భరమైన నీరసమైన అతని ప్రతిబింబం జబ్బుచేసిన అతని నీడలా వుంది. గోడమీద పెళ్ళిఫోటోలో మాత్రం కామాక్షమ్మ నవ్వుతోంది. ఎంత అమాయకంగా ఉంది ఆ నవ్వు! ఇప్పుడు కూడా అమాయకురాలు కాదనలేడు. మనిషి హృదయం మంచిది. ఉపకారబుద్ధి వుంది. ప్రేమ వుంది. అభిమానంవుంది. కాని ఆమెకి లేనిది తెలివీ, వివేకం. వీటికితోడు తనమాట చెల్లాలన్న పట్టుదల, ఆమెని క్రూరమైన మూర్ఖురాలిని చేసేసింది. పెళ్ళి కాకముందు ఆమె ఎంత అమాయకంగా ఉండేదంటే, ప్రపంచానికికావలసిన గడుసుతనంలేని ఈమె కాపురం యెలా చేస్తుందా, సంసారం యెలా తిప్పుకుంటుందా అని అంతా భయపడిపోయేవారు.

పెళ్ళి పెళ్ళిలానే జరిగిపోయింది. ఆనాటి కామాక్షిని బట్టి పెళ్ళికూతుర్ని నిర్వచించవచ్చు. ఆ తర్వాత కొత్త కుండలో నీరులా, కాపురం చల్లగా, హాయిగా కొన్నేళ్ళు గడిచిపోయింది. ఆ రోజులకి ఏట్లో ఎగిరే చేపల వెండి రంగుండేది! మత్తు ఎక్కించే అడవిపూల బరువైన పరిమళం ఉండేది. ఆ కాలంలో వారు దినాల్ని దినాలుగానే చూసుకోగలిగేవారు గాని, వారంలోని ఏడవభాగంగా, నెలలోని ముప్ఫయ్యోవంతుగా చూసుకోలేకపోయేరు. "ఈవేళ, నిన్న, రేపు" ఇవే వారు కాలాన్ని కొలిచే కొలతబద్దలు.

మొదటిపిల్ల పుట్టినా కామాక్షి మొహం నునుసిగ్గుతో

వెలిగిపోతూనే వుండేది. తర్వాత యిద్దరుపుట్టేలోగా ఆమెలో విచిత్రమైన మార్పులు వచ్చేయి. అంతవరకూ ఆమె ఆవాలూ, మెంతులూ చూసుకునేవరకే సంసారం చూసుకునేది. అంతకు మించి ఆమె తల ఆలోచించ లేకపోయేది. ఏ పొలం అమ్మడం విషయంలోనైనా, ఏకొత్తవస్తువు కొనడం విషయంలోనైనా అతను ఆమె సలహా అడిగినా, తనకేమీ తెలియదని తప్పించుకునేది. కాని ఆమె యిలా వుండడం మానేసి చాల్నాళ్ళైంది. ఆమెలో మార్పు మొదట యెప్పుడు వచ్చిందో చెప్పడం కష్టం. కాని అతను ఆ మార్పును మొదట కనిపెట్టటం వాళ్ళు పాత రేడియోగ్రాం అమ్మేసి కొత్తది కొన్నప్పుడే. ఆవేళ షాపులో అతను మంచి కంపెనీ రేడియోగ్రాం ఎంచేడు. ఆమె మరోటి ఎంచింది. ఆమె ఎంచింది మంచిదికాదు. ఆమాట ఆమెతో బాధపడుతూనే అన్నాడు.

"మనుషులే శాశ్వతంకాదు, వెధవ రేడియోగ్రాంల కొచ్చిందా బాధ ? ఎన్నాళ్ళుంటే అన్నాళ్ళే సరి. ఇదే తీసుకోండి" తీర్పు చెప్పేసింది. అక్కడే! ఆ షాపులోనే! షాపువాడు నవ్వకుండా నవ్వేడు. రంగనాథం బాధ ఆపుకున్నాడు. అప్పటికి ఏడాదై అతను కొత్త వ్యాపారంలో పడి సంసారం అంత పట్టించుకోలేదు. ఈమెలో యింత ధైర్యం, మొండితనం ఎప్పుడు వచ్చేయా అనుకుంటూ ఆమె చెప్పిన రేడియోగ్రామే కొన్నాడు. అతను కొన్నాడనడం కేవలం మర్యాద మాటేమో. "ఆమే కొన్నదనాలి" అనుకున్నాడతను.

ఆ తర్వాత అలాగే కొన్నాడని చెప్పాలి, తూరుపు

పొలం, ఫ్యాక్టరీలో వాటా, కొత్త కారూను. తను లొంగి పోవడం అతన్ని చాల్నాళ్ళు బాధపెట్టలేదు. తన మాట కాదని ఆమె ఎదురువచ్చి తన అభిప్రాయం వెలిబుచ్చి నప్పు డల్లా, అతను ఆమెలో పెరుగుతున్న ఆత్మ విశ్వాసానికి లోలోన గర్వించేవాడు. గోడమీద నీడకు వ్యక్తిత్వం, అభి ప్రాయం, ఆవేశం రావడంవల్ల ప్రాణం వచ్చినట్టయింది. పెళ్ళి కాకముందు అతను ఏమన్నా "సరే మీయిష్టం" అనేది. ఈ అతి ఒబీడిమెన్సు అతన్ని బాధించేది. ఎల్లకాలం తన యిష్ట మేనా? ఆమెకు స్వంత యిష్టం, స్వంత సరదాలూ, కోరి కలూ లేనేలేవా? మానసికంగా ఆమె తనకు ఎందుకు యింత బానిస అయిపోవాలి? ఒక్కనాడైనా "ఇవాళ సినిమాకువద్దు. సర్కసుకు వెళదాం" అనకూడదా ? అనలేదా ? అని పెళ్లైన తర్వాత అతను కొన్ని సంవత్సరాలు మథనపడ్డాడు. కాబట్టి ఆమెకు వచ్చిన వ్యక్తిత్వానికి అతను ఎంతో సంతోషించేడు. పిచ్చి పువ్వుకు పరిమళం వచ్చినట్టయింది. కడసారి మూగపిల్ల గొంతెత్తి గంధర్వగానం చేసినట్టూ, రెక్కవిరిగిన బంగారు పిచ్చుక మళ్ళీ ఎగిరినట్టూ అతనికి అన్పించింది. అప్పుడు అతను తన ప్రాణానికే ఒక నిండుతనం వచ్చినట్టు ఫీలయ్యేడు.

కాని ఆరోజు—ఇప్పటి కెన్నేళ్ళు ఔతుంది... పది కావచ్చు. ప్రాణం పోయినట్టయింది. ఈడొచ్చిన తన చెల్లెలు పెళ్ళి విషయంలో ఆమెతో ప్రస్తావించి తన దూరపుబంధువు శర్మకి యివ్వాలన్న తన అభిప్రాయం వెలిబుచ్చేడు. కాని ఆమె తన పినతల్లికొడుక్కే యివ్వాలంది. ఎలా ఇవ్వారో

చూస్తానంది. ఇవ్వకపోతే యిక నన్నెలా చూస్తారో కూడానని బెదిరించింది. తనమాట చెల్లకపోతే తన శవాన్నే అతను చూడగలుగుతాడని వ్యాఖ్యానించింది.

ఆమె మాటే చెల్లింది. పెళ్ళి సవ్యంగానే జరిగింది. కొత్త దంపతుల కాపురం అనుకున్న దానికంటె నిండుగానే జరుగుతోంది. కాని నిండుతనంపోయింది అతని జీవితంలోనే. ఆ తర్వాత ఆమె మాటే పైమాట. ఆమె చేయే పై చేయి. ఆమె ఆ యింటి యజమాని, యజమానురాలు కూడాను. ఆమె మళ్ళీ అత్మహత్య బెదిరింపు ప్రయోగిస్తుందేమోనని అతడు కొన్నాళ్ళు ఏ విషయంలోనూ తన అభిప్రాయాన్నే వెలిబుచ్చలేదు. ఆ తర్వాత తన దృష్టిలోనే తను చౌకఅయిపోయి, సర్దుకోవలసిన విషయాలలోకూడా మొండిగా తన అభిప్రాయానికి అతుక్కుపోయి ఆమెతో పేచీలుపడ్డాడు. అతనిలో వచ్చిన మార్పుకి ఆమె మొదట్లో కొంత వెనుకంజ వేసినా, అన్ని ముఖ్యవిషయాల్లోనూ తనమాటే చెల్లించుకుంది.

శివుడికి మూడోకన్ను, విష్ణువుకి సుదర్శనం, అర్జునుడికి పాశుపతాస్త్రం ఆఖరి ఆయుధాలు. ఆమెకు ఆత్మహత్య బెదిరింపు ఆఖరి సాధనం.

o o o

జీవితంలో ఎండమావు లుంటాయి. డిసెప్పాయింట్‌మెంట్స్ వుంటాయి. ట్రాజడీస్ వుంటాయి. పొద్దుగ్గాపడే ఎండ

నీడలు వుంటాయి. ఇవన్నీ అతనికి తెలుసు. వీటిని ఎదుర్కోవడానికి అత నెప్పుడూ సిద్ధమే. కాని బొంబాయి యెప్పుడు వెళ్ళాలో—కారు ఎప్పుడు మార్చెయ్యాలో — పొలాలు ఎవరికి మకాకి యివ్వాలో, కొత్త బిజినెస్‌లో ఎందరు పనివాళ్ళుండాలో నిర్ణయించవలసింది తనా ? ఆమే ?

తన యింట్లో తన కుక్కలా, తన తాలుకు నిన్నటి నీడలా అయిపోయింది అతని జీవితం. అయినా అతను తన అసంతృప్తి బైటపెట్టలేదు. లోపల అగ్నిపర్వతాలు పేలుతున్నా పైకి లావా రానివ్వక మధురమైన మంచుజల్లులే వెదజల్లేవాడు. ఎండిన పువ్వుకి సెంటు రాసినట్టున్నా అతని మొహాన్ని చిరునవ్వు ఎప్పుడూ అతుక్కునే వుంది. అతనికి నలభై దాటి రెండేండ్లయిపోయింది. జీవితం ఇంక మహా ఎన్నాళ్ళుంటుంది ? పది పదిహేను సంవత్సరాలు ! ఇన్నాళ్ళ ఆవేశాన్ని నిరోధించిన కట్టను ఈనాడు ఎలా తెగ్గొట్టాలి ? ఆమె అతనిభార్య. అర్ధాంగి. ఆమె జీవితంలో సంతోషించింది. తను పోయిననాడు "మంచి మనిషి" అని నిండుమనసుతో అంటే చాలు అతనికి, తను ఒక మహోన్నత లక్ష్యాన్ని సాధించినట్టే. మాధ్యం మినహాయిస్తే ఆమెకూడా ఏమంత తెలివి తక్కువది కాదు. ఆమె కొనే సామాను వేగంగా చెడిపోవడం వల్ల వారి సంసారం దివాలా తియ్యదు. ఇలా సర్దుకుపోవడమే అతని జీవిత లక్ష్యం. కాని అతి స్వల్పలక్ష్యాలుకూడా ఒక్కొక్కప్పుడు సాధించలేకపోతాము.

పదిరోజుల కిందట తన అన్న కూతుర్ని మెడిసన్లో ప్రవేశ పెడదామన్న అతని ఆశయం, అవకాశం అతను వదులుకోవాల్సి వచ్చినప్పుడు అతను ఒక మూఢ్యశక్తికి బలిపశువుగా తను మారిపోయినట్టు యాతనపడక తప్పలేదు.

"ఆడముండలకి ఎమ్బీ బియస్సేమిటి ? నాశ్రాద్ధం! మెడిసిన్ చదివిన దేవత్తయినా మొగుడితో కాపురం చేసుందా?" అని ఆమె ఫైనల్‌గా అనేసి పక్కమీద పడుకొని కళ్ళు మూసుకున్నప్పుడు, ఒక గేదెకి గేదెనే తృప్తిగా తీసేసి కళ్ళు మూసుకుని కలలుకంటున్న ఆడపులిలా కన్పించిందామె అతని కంటికి. అతను ఆమెతో వాదించేడు. బతిమాలేడు. బుజ్జగించేడు. కోప్పడ్డాడు. ఆమె తన పాత బెదిరింపు అతనిమీదికి విసిరింది, "నన్ను మళ్ళీ ప్రాణాలతో చూడాలని లేకపోతే ప్రవేశపెట్టుకోండి, మెడికల్ కాలేజీలోనో, మంగమ్మ సర్కసులోనో ..." ఆఖరుసారి పేలిన ఫిరంగి చావులా చల్లగా ఊరుకుండిపోయింది.

మూర్ఖత వివేకాన్ని మరోసారి జయించింది. మరోసారి అతనిజెండా నేల కూలింది. ఈ పదిరోజులూ చల్లారుతున్న మరఫిరంగుల పొగ అతని గుండెల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూనే వుంది.

○ ○ ○

ఈవేళ అతని జీవితంలోకెల్లా క్లిష్టమైనరోజు. ఎప్పుడో చూసిన అక్షరాల్లావున్న కవరు అతను చింపుతున్నప్పుడు

ఆమె అతని పక్కనేవుంది. ఉత్తరం సరస్వతి దగ్గరున్నంది. సరస్వతి—వెన్నెలపరు—నవ్వుల పువ్వు. ఆమె మనసులోని మల్లెలు అందరికీ కన్పిస్తాయి.

ఎన్నాళ్ళయింది ఆమెనుచూసి? ఎన్నేళ్ళో! ఏ పాత జన్మలోనో! ఏ పాడుబడ్డ బురుజుమీద ఎన్నడో! కాలంలో కలిసిపోయిన రాణీ తిరిగి నిలబడి నవ్వుతున్నట్టూ, ఏనాడో విరిగిపోయిన కల అతుక్కున్నట్టూ అయింది అతనికి.

“రేపు మెయిల్లో సరస్వతొస్తుందిట — నెల ఉంటానంటోంది?”

“సరస్వతంటే ఎవరు? మీరు చిన్నప్పుడు కొంగు పట్టుకు తిరిగిన ఆ తాటకేనా? ఇంకా ఆ రాక్షసిని మరచిపోలేదూ? అది రాసిన వుత్తరం పట్టుకుంటేనే చింకిచేటంతైంది అయ్యగారి మొహం.” ఆమె మాటలు నిప్పులకత్తుల్లా గుచ్చుకున్నాయి అతని హృదయంలో. ఆఖరిసారిగా చెప్పేసింది “ఆ పిశాచి తన యింట్లో కాలుపెట్టిన క్షణానే తానీ లోకం వదిలేస్తాననీ, రావద్దని ఆమెకు రాత్రిలోగానే టెలిగ్రాం ఇవ్వమనీ.”

అతను టెలిగ్రాం యివ్వలేదు. అందరి మానవుల హృదయాల్లోనూ ఉన్న అసహ్యం అంతా నింపేసింది క్షణకాలంపాటు. “ఏమైతే అదే అవనీ, టెలిగ్రాం యివ్వను” నిశ్చయించుకున్నాడు.

సరస్వతి తనకు దూరపుబంధువు. చిన్ననాటిస్నేహితు

రాలు. ఆమె తనంతగా తను వస్తానంటే రావద్దనడం రాక్షసత్వం. ఈ విషయాలు నచ్చచెప్పడానికికూడా వీల్లేకుండా కామాక్షమ్మ కిందగదిలో తలుపు గడియవేసుకొనిపడుకుంది. ఆమె దగ్గరికివెళ్ళి నచ్చజెప్పుదామన్నా; గొడవపడదామన్నా వీల్లేకుండా యింటినిండా బంధువులున్నారు.

"శలిగ్రాం యివ్వను" అని అతను ఆ మధ్యాహ్నం అన్నప్పుడు ఉన్న ధైర్యం కాలంజరుగుతున్నకొద్దీ సడలిపోసాగింది. ఆకుల్లాంటి సాయంత్రపు నీడలు గరళంలాంటి గాఢాంధకారంలోకి మారేసరికి మనసులోని ధైర్యం తిరిగి కరిగిపోయింది.

తన భార్య పతివ్రత. తన బిడ్డలు ఆరోగ్యవంతులు. అదృష్టవంతులు. తనకు భారీఎత్తున బిజినెస్ వుంది. బోలెడు భూములున్నాయి. ఆరోగ్యం వుంది. ఐశ్వర్యం వుంది. కాని అశాంతి అతని మనస్సుని వదలదు. నిత్యం ఏదో వ్యథ వేధిస్తూవుంటుంది. ఈ గండం ఎలా గడుస్తుంది? అతను ఆలోచన సుళ్ళలో గిరగిర తిరిగిపోతున్నాడు.

కాలకూటం చల్లే యీ కాళరాత్రి అంతం అవదా? "అవదు" అన్నట్టు గోడగడియారం కాలాన్ని సమ్మెటతో కొట్టి సాగదీస్తున్నట్టు చప్పుడు చేస్తోంది. ఎదురుగా పుస్తకాల బీరువాలో తన ప్రతిబింబం తను చనిపోయేక తీసినఫొటోలా వుంది.

కిటికీవరకూ నీరసంగా యాంత్రికంగా నడిచివెళ్ళే డతను. దూరాన పోతున్న కారు డేంజరులైట్లు తన పైశాచి

కపు పని పూర్తిచేసుకొని చప్పుడులేకుండా నవ్వుతూ వెళ్ళి పోతున్న పిశాచం కళ్ళలా మెరుస్తున్నాయి.

ముసిలిరాక్షసుడి బోసినోరులా వున్న ముదిమామిడి తొర్రలోపల పడిన వెన్నెలని తాగేస్తున్నట్లుంది.

తనగుండె తనకే భయంకరంగా వినిపించేటంత గట్టిగానూ, ఎప్పుడు ఆగిపోతుందో చెప్పలేనంత జోరుగానూ కొట్టుకుంటోంది.

అప్రయత్నంగా వెనక్కి తిరిగేడు. పెళ్ళిపాటోలా కామాక్షి శత్రువంశాన మిగిలివున్న పసిగుడ్డునుకూడా కడ తేర్చిన పిచ్చిరాణీలా నవ్వుతోంది.

ఈలోగా...

భగవాన్! ఏమిటా నూతిలో చప్పుడు? గిర్రున వెనక్కి తిరిగేసరికి అప్పుడే రెండోఆట సినిమానుండి వచ్చిన పక్కింటి పడుచుజంట కాళ్ళు కడుక్కోవడానికి నూతిలోనుండి బాల్చీ తోడుతూ కనిపించేరు. ఈ రాత్రి ఏం కానుందో?

సూర్యోదయం ఏ పాపం చెయ్యని పసిపాపలా బాలభానుడు లేచేలోగా తను ఏ దృశ్యాలు చూడాలో?

నూతిచుట్టూ మనుషులు. 'అయ్యో పాపం! ప్చ్! ప్చ్ప్చ్...' పోలీసుల కాలిజోళ్ళఇనుపమేకులు నల్లరాళ్ళమీద రేపే నిప్పుల రవ్వలు___పంచాయితీ పెద్దల పాదాలకింద నెరసిన జుట్టులో వివేకం___కుతూహలానికి లొంగి బలవంతాన చచ్చిన మనిషిని చూసే చుట్టుపక్కలవాళ్ళ కపట సానుభూతి,

తడిసిన తెల్ల మల్లుబట్టలోంచి ఎర్రగా కన్పించే శవం శరీర భాగాలు_ఏం చూడాలో!_ అనుకుంటూ ఈజీచైర్లో కూర్చుని ఆలోచించసాగేడు అతను.

*    *    *

పదిహేంది ఒక్కసారి తన్నినట్లు తెరుచుకున్న తలుపుల చప్పుడుకు ఉలిక్కిపడి లేచేడతను.

"లెండి, లెండి. తొమ్మిదైనా అయ్యగారికి మేలుకొలుపు లవలేదు కాబోలు" అంటూ నవ్వుతూ ప్రవేశించింది కామాక్షమ్మ కాఫీట్రేతో.